క్లుప్తంగా

'ఉపాధి' పని దినాలు పెంచాలి



నారాయణపేట టౌన్: ఉపాధి పని దినాలు పెంచాలని పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి గణేష్ అన్నారు. మండలంలోని అప్పిరెడ్డిపల్లిలో ఉపాధి హామీ హామీ కూలీలు, పీవైఎల్ నాయకులు నిరసన వ్యక్త చేశారు. వారు మాట్లాడుతూ రోజుకు రూ. 600 కూలి ఇవ్వాలని, మేటీలకు పారితోషకం ఇవ్వాలన్నారు. ఇన్సూరెన్స్, పని స్థలాల్లో కనీస సౌకర్యాలు, పనిముట్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రశాంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి



నారాయణపేట టౌన్: పట్టణంలోని 15వ వార్డు పరిధిలోని మిషన్ భగీరథ పైపులైన్లు పనులను సక్రమంగా చేపట్టాలని వార్డు కౌన్సిలర్ బండి రాజేశ్వరి కాంట్రాక్టర్‌కు సూచించారు. అలాగే కమ్యూనిటీ హాల్స్ పనులు పరిశీలించారు. వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, శివరాంరెడ్డి, చక్రధర్, రమేష్, రఘు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం వేగవంతం



మరికల్: ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం వేగవంతంగా చేయాలని తహసీల్దార్ రాంకోటి అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం బూత్ స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. ఓటర్లకు సంబంధించిన దరఖాస్తులు ఫారం 6, 7, 8 విచారణ పూర్తి చేయాలని సూచించారు. ఆధార్‌లో తప్పుఒప్పులను కూడా సవరించి ఓటర్‌కు అనుసంధానం పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు.

యువకులు క్రీడల్లో రాణించాలి



నర్వ: యువకులు క్రీడలలో రాణించాలని బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం రాయికోడ్‌లో ఆర్‌పీఎల్ ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకుని మాట్లాడారు. ఔత్సాహికులైన క్రీడాకాలరును ప్రోత్సహించేందుకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి క్రీడా దుస్తులను అందించారన్నారు. కార్యక్రమంలో అయ్యన్న, ఉప సర్పంచ్ నర్సింహారెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



నారాయణపేట రూరల్: ఎట్టకేలకు తిర్మలాపూర్ రోడ్డుకు మోక్షం లభించింది. నాణ్యతగా రోడ్డు పనులు పూర్తి చేయాలని సోమవారం ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని కాంట్రాక్టర్‌కు హెచ్చరించారు. ఆయన వెంట సుధాకర్‌బాబు, నర్సింహులు, వెంకటప్ప, ప్రభాకర్‌రెడ్డి, దస్తప్ప ఉన్నారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థికి గోల్డ్ మెడల్



దామరగిద్ద: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాపన్‌పల్లికి చెందిన విద్యార్థి రవికుమార్ గోల్డ్ మెడల్ సాధించాడు. హన్మకొండ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో 15 మంది పాల్గొన్నారు. తన ప్రతిభతో జావెలిన్ త్రోలో 44.5 మీటర్లు త్రో చేసి ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ గ్రామస్తులను విద్యార్థిని అభినందించారు.

ప్రారంభోత్సవాలకు సిద్ధం



నిడుగుర్తిలో రంగులు వేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న పాఠశాల



నిడుగుర్తి పాఠశాల తరగతి గదిలో బెంచీలపై కూర్చున్న విద్యార్థులు

- చివరి దశకు చేరుకున్న 'మన ఊరు–మన బడి' పనులు
- మొదటి విడతలో 16 పాఠశాలల ఎంపిక
- మౌలిక వసతుల ఏర్పాటు

ఊట్కూర్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటుచేసి మెరుగైన విద్యను అందించేందుకు చేపట్టిన మన ఊరు–మన బడి పనులు చివరి దశకు చేరుకున్నాయి. పూర్తయిన పాఠశాలల్లో ప్రారంభోత్సవాలకు సిద్ధం చేస్తున్నారు. మండలంలో 48 పాఠశాలలకు మొదటి విడతలో 16 ఎంపిక చేశారు. విద్యా కమిటీ ఆధ్వర్యంలో పనులు కొనసాగుతున్నాయి. పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, రంగులు వేయడం, వంటగది, ప్రహరీగోడ తదితర పనులు చేపడుతున్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో టెండర్ వేయకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. మిగత 15 పాఠశాలల్లో పనులు నడుస్తున్నాయి. విద్యాశాఖ అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు. 15రోజుల్లో ప్రారంభోత్సవాలు చేపడుతున్నట్లు ఏఈ శ్రీకాంత్ తెలిపారు.

మంజూరైన నిధులు

బిజ్వార్ రూ.8లక్షల6వేలు, చిన్నపోర్ల రూ.12లక్షలు, నిడుగుర్తి ఉర్దూ మీడియం రూ.4లక్షలు, తెలుగు మీడియం రూ.9.60లక్షలు, పెద్దజట్రం తెలుగు మీడియం రూ.9.11లక్షలు, ఉర్దూ మీడియం రూ. 3.45లక్షలు, పెద్దపోర్ల రూ.10.91లక్షలు, పులిమామిడి రూ.5.34లక్షలు, ఊట్కూర్ (జీపీఎస్) రూ.6.72 లక్షలు, ఉర్దూ మీడియంకు రూ.5.69 లక్షలు, ఎడవెల్లి రూ.14.35లక్షలు, మల్లెపల్లి రూ.10.10 లక్షలు, తిప్రాస్‌పల్లి రూ.11.13లక్షలు, బిజ్వార్ జెడ్పీహెచ్ఎస్‌కు రూ.19.82లక్షలు, చిన్నపొర్ల జెడ్పీహెచ్ఎస్ రూ.25.76లక్షలు, ఊట్కూర్ జెడ్పీహెచ్ఎస్ రూ. కోటీ25 లక్షలు మంజూరయ్యాయి.

కంటైనర్‌లో తరగతి గదులు

మండల కేంద్రంలోని జీపీఎస్ పాఠశాలలో కంటైనర్‌లో రెండు తరగతి గదులను ఏర్పాటు చేశారు. తరగతి గదుల్లో విద్యార్థులకు బెంచీ లు, బ్లాక్ బోర్డులు, ఫ్యాన్లు, గ్రంథాలయం ర్యాక్స్ తదితర వసతులు ఏర్పాటు చేశారు.



ఊట్కూర్‌లో కంటైనర్‌లో ఏర్పాటు చేసిన తరగతి గదులు

పనులు పూర్తవుతున్నాయి..



పాఠశాలకు రూ.13.60లక్షలు మంజూరయ్యాయి. విద్యుత్, తాగునీరు, రంగులు వేయడం, మరుగుదొడ్లు తదితర పనులు పూర్తవుతున్నాయి. 320 మంది విద్యార్థులకు 171 బెంచీలు తరగతి గదుల్లో ఏర్పాటు చేశారు. మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడం సంతోషంగా ఉంది.

– లక్ష్మారెడ్డి, హెచ్ఎం, నిడుగుర్తి

కంటైనర్‌లో తరగతి గదులు



మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా కంటైనర్‌లో రెండు తరగతి గదులను ఏర్పాటు చేశారు. గదుల్లో బెంచీలు, ఫ్యాన్లు, లైట్లు, బ్లాక్ బోర్డులు, ఇతర వసతులు కల్పించారు. కంటైనర్‌లో తరగతి గదులు ఆహ్లాదకరంగా ఉన్నాయి. పాఠశాలలో 120 మంది విద్యార్థులకు 62 బెంచీలు ఏర్పాటు చేశారు.

–శ్రీవిద్య, హెచ్ఎం, జీపీఎస్, ఊట్కూర్

కేసీఆర్ హయాంలోనే రాష్ట్ర అభివృద్ధి

మక్తల్: సీఎం కేసీఆర్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ముస్లిం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం రంజాన్ సందర్భంగా రూ.1.20లక్షల చెక్కును ముస్లిం పెద్దలకు అందజేశారు. పట్టణానికి ఫైర్‌స్టేషన్ మంజూరు కావడంతో స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు.

మహిళా సంఘాల అభివృద్ధికి కృషి

ఊట్కూర్: ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తుందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బిజ్వార్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో పీఎంఎఫ్ఎంఈ పథకంలో భాగంగా ఫుడ్ ప్రాసెసింగ్ 3 యూనిట్లను ప్రారంభించారు. మహిళలు ఈ యూనిట్ల ద్వారా ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు స్త్రీనిధి, బ్యాంకు లింకేజీల ద్వారా వడ్డీలేని రుణాలను అందిస్తుందని తెలిపారు. అనంతరం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్, సర్పంచ్ సామిత్రమ్మ, అరవింద్‌కుమార్, బాల్‌రెడ్డి, నిర్మలా పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఉర్దు హాల్‌లో రంజాన్ సందర్భంగా కిట్‌లను పంపిణీ చేసి, అనంతరం ఇఫ్తార్‌లో పాల్గొన్నారు.



మాగనూరులో ముస్లింలకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం

మాగనూర్: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ అమీర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రంజాన్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని ముస్లింలకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సముచిత ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ఇందులో భాగంగానే రంజాన్ కిట్లు, క్రిస్మస్ కానుకలు, బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తుందని తెలిపారు. మైనార్టీల విద్యాభివృద్ధి కోసం రెసిడెన్షియల్ స్కూళ్లు, గురుకులాలు ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, సింగిల్ విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్‌మాసం



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, ముస్లింలు

నారాయణపేట: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తున్న ఇఫ్తార్ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఫంక్షన్‌హాల్‌లో ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మత పెద్దలకు ముస్లింలకు రంజాన్ మాసపు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో అన్ని మతాలకు, కులాలకు సీఎం కేసీఆర్ సమాన ప్రోత్సాహం అందిస్తున్నారన్నారు. ఈ మాసంలో ఎంతో భక్తిశ్రద్ధలతో కఠినంగా ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలు అందరూ ఆనందంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎంఎఫ్‌సీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, జెడ్పీ చైర్‌పర్సన్ వనజ, మార్కెట్ చైర్‌పర్సన్ జ్యోతి, జెడ్పీటీసీ అంజలి, ఆర్డీఓ రాంచందర్‌నాయక్ పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితం

మాగనూర్: గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారుల సౌకర్యార్థం ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులు తమ సాధనకు మంచి అవకాశం లభించిందని సంబరపడే లోపే అధికారుల నిర్లక్ష్యం వెక్కిరిస్తుంది. మండలంలోని బైరంపల్లిలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం వద్ద కనీస వసతులు లేకపోవడంతో పాటు, పిచ్చి గడ్డికి నిలయంగా మారడంతో క్రీడా మైదానంలో సాధన చేయాలనుకునే యువకులు అసంతృప్తికి గురవుతున్నారు. ముఖ్యంగా ఎటువంటి ట్రాక్, సదుపాయాలు ఏర్పాటు చేయకపోవడంపై సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



అస్తవ్యస్తంగా ఉన్న బైరంపల్లి క్రీడాప్రాంగణం

చెరువు మట్టితో పొలాలు సారవంతం

మాగనూర్: చెరువు మట్టి నేలను సారవంతం చేస్తుందని ఏఓ హరిత సోమవారం ప్రకటనలో తెలిపారు. రైతులు అధిక దిగుబడి రావాలని రసాయన ఎరువులు మోతాదు మించి వాడకం మూలనా నేలలో ఉన్న మిత్ర పురుగులు నశించిపోతున్నాయి. దీంతో పాటు క్రిమిసంహార మందుల పిచికారీ మూలనా సైతం పర్యావరణం దెబ్బతింటుంది. ఈ నేపథ్యంలో తేలికపాటి ఖర్చుతో రైతులు తమ నేలను సారవంతం చేసుకునేందుకు చెరువు మట్టి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పంటలకు అవసరమయ్యే పోషకాలుండటంతో పాటు పంట ఏపుగా పెరిగి మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. నేల సారవంతం కావడంతో పాటు నీటినిల్వ సామర్థ్యం పెరుగుతుంది. మొక్కలు అధిక వర్షం, వర్షాభావ పరిస్థితి నేపథ్యంలో సైతం పంటలు తట్టుకుంటాయి. చెరువు మట్టిలోని పోషకాల వల్ల పంటకు రోగ నిరోధక శక్తి అధికంగా ఉంటుంది. ఏప్రిల్, మే మాసాల్లో రైతులు తప్పనిసరిగా చెరువు మట్టిని తమ పొలాల్లోకి తరలించడం చాలా వరకు మంచిదని తెలిపారు. వేసవిలో చెరువు, కుంటల్లో నీరు ఉండదు. మట్టిని తరలించడం సులభంగా ఉంటుం

అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు

మాగనూర్: అమ్మాయిలను వేధింపులకు గురిచేస్తే కఠినచర్యలు తప్పవని షీ టీమ్ ఇన్‌చార్జ్ ఎస్ఐ సుధామాధురి అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని నేరడగంలో జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, అమ్మాయిపై వేధింపులు వంటి వాటిని ఎట్టి పరిస్థితిలో సహించమన్నారు. పాఠశాలలో, కళాశాలలో, బస్టాండ్, నిర్మానుష్య ప్రాంతాల్లో అమ్మాయిలను ఎవరైనా వేధింపులకు గురిచేస్తే వెంటనే జిల్లా షీ టీం హెల్ప్‌లైన్ నంబర్ 8712670398 లేదా డయాల్ 100 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. విద్యార్థులు నేటి కాలంలో సెల్‌ఫోన్ వినియోగం ఎక్కువైందని, సోషల్ మీడియాకు అలవాటుపడి సమయాన్ని వృథా చేయరాదన్నారు. జీవితంలో ఉన్నత లక్ష్యంపెట్టుకొని ముందుకు సాగాలన్నారు.



అవగహన కల్పిస్తున్న ఎస్ఐ సుధామాధురి

బ్రిడ్జి మరమ్మతు చేపట్టాలి



పెద్దకడ్మూర్ వద్ద పూర్తిగా దెబ్బతిన్న ఇరుకైన వంతెన



కొండదొడ్డి వద్ద దెబ్బతిన్న బ్రిడ్జి

నర్వ: మండలంలోని మక్తల్, గద్వాల్ ప్రధాన రహదారి రోడ్డు పనులు ఇటీవల ప్రారంభమైన నేపథ్యంలో బ్రిడ్జి మరమ్మతు పనులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రధానంగా కొండదొడ్డి వాగుపై ఉన్న బ్రిడ్జి, పెద్దకడ్మూర్ వద్ద ఉన్న ఇరుకైన వంతెన కొన్ని రోజులుగా పూర్తిగా దెబ్బతిని అడుగడుగున గోతులు పడ్డాయని వాపోతున్నారు. ఈ బ్రిడ్జిలపై ఏర్పడ్డ గోతులతో నిత్యం ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పుష్కరాల సమయంలో వేసిన రహదారి పనుల్లో కూడా ఈ బ్రిడ్జిల మరమ్మతు చేపట్టకపోవడంతో అవి పూర్తిగా దెబ్బతిన్నాయని అంటున్నారు.

సర్వేపల్లికి ఘన నివాళి

నారాయణపేట రూరల్: సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతిని పట్టణంలోని పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.



డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించాలి

మరికల్: మండలంలో డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు హరీష్, రామకృష్ణ, సత్యన్న, మొగులప్ప, చెన్నారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం కావడంతోనే ఇళ్ల మాటను పక్కన పెట్టిందన్నారు. పెరిగిన స్టీల్, సిమెంట్ ధరల కారణంగా సొంతింటిని నిర్మించుకోలేని దీనస్థితిలో ఉన్న పేదల కోసమైన ప్రభుత్వం పల్లెలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

భద్రాచలంలో పల్లెగడ్డ భజన బృందం

మరికల్: మండలంలోని పల్లెగడ్డ గ్రామానికి చెందిన టీటీడీ భజన బృందం సోమవారం భద్రాచలంలో అఖండ భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం కొందరు టీటీడీ సేవలకు దర్శన క్యూలైన్, అన్నదాన, హుండీ లెక్కింపు వద్ద సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని టీటీడీ సభ్యుడు శ్రీరామ్ తెలిపారు. మరికొందరు అఖండ భజనలో పాల్గొన్నట్లు తెలిపారు.

నేడు రంజాన్ కిట్ల పంపిణీ

నారాయణపేట టౌన్: రంజాన్ పండుగను సందర్భంగా ప్రభుత్వం ద్వారా పేద ముస్లింలకు ఇచ్చిన కిట్లను సోమవారం జిల్లా కేంద్రంలో అశోక్‌నగర్‌లో 7వ వార్డు కౌన్సిలర్ సలీం పంపిణీ చేశారు. కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన కిట్‌లను సద్వినియోగం చేసుకుని పండుగను సుఖసంతోషల మధ్య చేసుకోవాలని కోరారు.

కృష్ణా: మండలంలోని పేద ముస్లింలకు ప్రభుత్వం అందించే రంజాన్ కిట్లను మంగళవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ రమేష్ సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మండల ముస్లింలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి

ధన్వాడ: పార్టీ బలోపేతనికి బూత్ స్థాయి నుంచే కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోవర్ధన్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని గోటూర్‌లో బూత్ స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటయ్య, నరేష్, మహిపాల్‌రెడ్డి, మహేష్, కృష్ణయ్య, రాంరెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం

నారాయణపేట టౌన్: మున్సిపాలిటీలోని 7వ వార్డులో 15 రోజులుగా పారిశుద్ధ్య సిబ్బంది డ్రెయినేజీలు శుభ్రం చేయడం లేదని కౌన్సిలర్ ఎండి.సలీం అన్నారు. డ్రెయినేజీలు మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలు నిండిపోయి రోడ్లపై పారుతున్నాయన్నారు. దుర్వాసన, కంపుతో పాటు దోమల స్వైర విహారం చేయడంతో ప్రజలు రోగాల బారిని పడుతున్నారని, వార్డులోని భీవండి కాలనీ, బాబా కాలనీ, గాయత్రీ నగర్, లింగేశ్వరస్వామి కాలనీ, అంబేద్కర్ చౌరస్తాలో ఇదే పరిస్థితి ఉందన్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ సునీత వార్డులో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటాం

మరికల్: ఇంటింటికీ వెళ్లి సీపీఐ ఆధ్వర్యంలో సమస్యలను తెలుసుకుంటున్నామని పార్టీ మండల కార్యదర్శి రాము అన్నారు. సోమవారం తీలేర్‌లో ఇంటింటికీ సీపీఐ ఆధ్వర్యంలో గ్రామంలోని సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంతో ప్రభుత్వం విఫలమైందన్నారు. రాబోవు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

నారాయణపేట రూరల్: స్థానిక శివలింగేశ్వర దేవాలయంలో సోమవారం ఆర్‌వీఎల్ఎల్‌బీఎస్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. బసవ జయంతిని పురస్కరించుకుని లింగాయత్ చిన్నారులకు మహాత్మా బసవేశ్వరుడి జీవిత విశేషలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పలువురు చిన్నారులు హాజరై ఆలయంలో పూజలు చేసి వ్యాసం రాశారు. విజేతలకు బసవజయంతి రోజు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో గందె రవికాంత్, మలికార్జున్, రవికుమార్, సచిన్, రఘుబాబు, శివకుమార్ పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు

అమరచింత: చలివేంద్రాలు వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చుతూ వారికి ఉపసమనం ఇస్తున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. పట్టణంలో శబరీనాథ్‌గౌడ్, అక్షయ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడానికి ఎన్నో మార్గాలు ఉన్నాయని, దాహంతో అలమటిస్తున్న వారికి తాగునీటిని అందించడం ఎంతో ఉత్తమమైన సేవా కార్యక్రమం అన్నారు. కొన్నేళ్లుగా పట్టణంలో నీలగిరి సాలిమఠం అయ్యప్పస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం నిర్వహించడం అభినందనీయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ శివనాగేశ్వరనాయుడు, గోపాలకృష్ణ గురుస్వామి, మార్కెట్ చైర్మన్ ఎస్ఏ రాజు, బీఆర్ఎస్ యూత్‌వింగ్ రాష్ట్ర కన్వీనర్ శ్రీలన్‌గౌడ్, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు రమేష్, నరసింహులుగౌడ్, చిన్నబాలరాజ్, కేశవగౌడ్, పురుషోత్తంగౌడ్, కమలాకర్‌గౌడ్, అక్బర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

అమరచింత: వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు అధికంగా సంభవించే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాల నుంచి కాపాడుకోవాలని ఆత్మకూర్ ఫైర్ అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. ఆత్మకూర్ మండలంలోని లోయర్ జూరాల హైడల్ పవర్ ప్రాజెక్టు ఉద్యోగుల క్యాంప్‌లో సోమవారం అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకేజీ వాసన వస్తున్నప్పుడు అప్రమత్తంగా ఎలా వ్యవహరించాలి, ప్రమాదం నుంచి తమను తాము ఎలా కాపాడుకోవాలి అనే విషయాలపై ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పట్టణాలు, గ్రామాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది నరేష్‌గౌడ్, సందీప్‌రెడ్డి, నరసింహారెడ్డి, వెంకట్ నరసింహ, భానుచందర్, వెంకటేశ్వర్‌రావు, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే పీడీయాక్ట్



మహబూబ్‌నగర్ క్రైం: శాంతి భద్రతలకు సమస్య కలిగించి, నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ డి.స్వామిగౌడ్ అన్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో ఉన్న రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎలాంటి సంఘ విద్రోహక కార్యకలాపాల్లో పాల్గొనరాదని, ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు రామకృష్ణ, బాలకృష్ణ పాల్గొన్నారు.

పాముకాటుకు ఎద్దు మృతి

మక్తల్: మండలంలోని గొల్లపల్లిలో సోమవారం రైతు తిరుపతికి చెందిన ఎద్దు పాము కాటుకు గురై మృతి చెందింది. దీని విలువ రూ.75 వేలు ఉంటుందని రైతు వాపోయాడు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

